పాదయాత్రతో సంక్షేమ పాలనకు నాంది



నూజివీడులో కేక్ కోస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు, స్థానిక నేతలు



మైలవరంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కోసిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, ఇతర నేతలు



ప్రజా సంకల్పయాత్ర నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా తిరువూరులో కేక్ కోస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

నూజివీడు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన పాదయాత్ర చరిత్రాత్మకమని, ప్రజా సంకల్పంతో సంక్షేమపాలనకు నాంది పలికారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. జగన్ పాద యాత్ర నిర్వహించి నాలుగేళ్లయిన సందర్భంగా స్థానిక బాపూనగర్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద సోమవారం ఆయన కేక్ కోసి మాట్లాడారు. పాదయాత్రలో ప్రజల కష్టసుఖాలను తెలుసుకొన్న జగన్ అధికారంలోకి రాగానే వారి సమస్యలను పరిష్కరిస్తూ.. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. రాబోయే ఎన్నికల్లోనూ ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టడం ఖాయమని చెప్పారు. రాష్ట్ర ఖజానాను, సహజ సంపదలను దోచుకోవడం తప్పితే ప్రజలకు, రాష్ట్రానికి గానీ చంద్రబాబు చేసిందేమీ లేదని ఆరోపించారు. స్వయంగా చంద్రబాబే సైకిల్ పోవాలంటూ ప్రచారం చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యులు లాం ప్రసాదరావు, కౌన్సిలర్లు తలారి ధనలక్ష్మి, కొడవటి రాంబాబు, నాయకులు బసవా వినయ్, పిల్లా చరణ్, సతీష్, మేకల అనిల్, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ప్రజాసంకల్ప యాత్రతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ అన్నారు. ప్రజాసంకల్పయాత్ర చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు ఇబ్రహీంపట్నంలో సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే వసంత.. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కోశారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలడుగు జోత్స్న, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, డైరెక్టర్ గుమ్మడిదపు రవీంద్రరాణా, పీఏసీఎస్ చైర్మన్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైలవరం: ప్రతిపక్ష నాయకుడిగా సుదీర్ఘ పాతయాత్ర చేసి ప్రజల సమస్యలు గుర్తించి, ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర పూర్తి చేసి సోమవారం నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మైలవరంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కేక్ కోశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన, ఇవ్వని హామీలను కూడా నెరవేర్చి ఏపీ చరిత్రలో సువర్ణ అధ్యాయం లిఖించారన్నారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

తిరువూరు: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర పూర్తిచేసి నాలుగేళ్లు గడిచిన సందర్భంగా తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో కేక్ కోశారు. అశోక్ నగర్లో, నియోజకవర్గ కార్యాలయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 99 శాతం నెరవేర్చారని రక్షణనిధి పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, లోకేశ్వర రావు, భూక్యా గన్యా, ఎంపీపీలు గద్దల భారతి, పిల్లి వనజాక్షి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఆగిరిపల్లి: సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం సచివాలయం పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి బ్రోచర్లను అందజేశారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి జగన్‌కు అండగా ఉండాలని కోరారు. టీడీపీ నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మవద్దని నమ్మితే మరోసారి మోసపోవాల్సి వస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచి కొల్లిపర ఝాన్సీ, ఎంపీటీసీ సభ్యురాలు కారు తేజస్విని, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి మచ్చా హరిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, ఎంపీపీ గోళ్ళ అనూష ఇసాక్, నేతలు మొక్కపాటి కిరణ్, వేము రాజు తదితరులు పాల్గొన్నారు.



అడవినెక్కలంలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

నూజివీడు: యువత జూదాలకు దూరంగా ఉండి క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సూచించారు. స్థానిక డీఏఆర్ కళాశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి వాలీబాల్ పోటీలను సోమవారం సబ్‌కలెక్టర్ ప్రారంభించారు. తహసీల్దార్ డీవీఎస్ ఎల్లారావు, రూరల్ ఎస్సైరామకృష్ణ, పీడీలు పాల్గొన్నారు.

ముసునూరు: క్రీడలతో దేహదారుఢ్యంతోపాటు, మానసిక ఉల్లాసం కలుగుతాయని తహసీల్దార్ దాసరి సుధ అన్నారు. స్థానిక రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను అధికారులతో కలసి ఆమె ఆరంభించారు. ఎస్సై ఎం.కుటుంబరావు, ఎంపీడీఓ జి.రాణి, ఎంపీటీసీ లక్ష్మి అర్లప్ప సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జూద క్రీడలు వద్దు - సంప్రదాయ క్రీడలు ముద్దు కార్యక్రమంలో భాగంగా కబడ్డీ పోటీలను పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఎస్సై చంటిబాబు, ఏఎస్సై నాయక్, పీడీ రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు ఎల్బీఆర్సీఈ విద్యార్థినిలు

మైలవరం: 26వ నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినిలు ఎస్.ఊహాజాహ్నవి, మీనామహిత ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ 26వ నేషనల్ యూత్ ఫెస్టివల్ ఈ నెల 12 నుంచి 16 వరకు భారతదేశ యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కర్నాటక హుబ్లీలోని ధార్వాడ్‌లో జరుగుతాయన్నారు. దీనికి రాష్ట్రం నుంచి 12 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఎంపిక చేయగా తమ కళాశాల నుంచి ఇద్దరు ఎంపిక వ్వడం అభినందనీయమన్నారు. వీరిద్దరిని కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, డీన్స్, వివిధ విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి. శివహరిప్రసాద్ తదితరులు అభినందించారు.

రూ.4.5 కోట్లతో సొసైటీ భవనాల అభివృద్ధి

మైలవరం ఎమ్మెల్యే వసంత

చంద్రాల(మైలవరం): నియోజకవర్గంలో రూ.4.5కోట్ల వ్యయ అంచనాతో సొసైటీ భవనాలను అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. చంద్రాల గ్రామంలో రూ.32.75 లక్షల వ్యయ అంచనాతో నిర్మించనున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(సొసైటీ) భవన నిర్మాణానికి కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, డైరెక్టర్ రవీంద్రరాణాతో కలిసి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం శంకుస్థాపన చేశారు. వసంత మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గంలో 28 సొసైటీలు ఉండగా 18 సొసైటీల్లో రూ.4.5 కోట్లతో నూతన భవన సముదాయాలు, ఆధునీకరణ పనులు చేసినట్లు తెలిపారు. నిర్మాణాలకు నిధులు కేటాయించిన కేడీసీసీబీ మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకట్రావు, ప్రస్తుత చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. చంద్రాలలో 360 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని, ఒకసారి ఇళ్ల స్థలాలు ఇచ్చి చేతులు దులుపుకునే సంస్కృతి ఈ ప్రభుత్వానికి లేదని ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి, మాజీ ఎంపీపీ గంగాధరరావు, ప్రజాప్రతినిధులు, గ్రామ కన్వీనర్ చనమోలు రవిబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చంద్రాలలో జరిగిన శంకుస్థాపనలో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, తన్నీరు నాగేశ్వరరావు

పథకాల అమల్లో అన్యాయం జరిగితే సహించం

ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

నూజివీడు: అర్హులకు సంక్షేమ పథకాల అమలులో అన్యాయం జరిగితే సహించబోమని ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు హెచ్చరించారు. స్థానిక బాపూనగర్ వార్డు సచివాలయాన్ని ఆయన సందర్శించారు. స్థానికులు, పలువురు కౌన్సిలర్లు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ గాంధీ పని తీరుపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అర్హత ఉన్నా పింఛన్ల పరిశీలనలో ఇష్టం వచ్చినట్లు రిజెక్ట్ చేశాడని, కొందరికి తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి వద్ద లేరని చెప్పి మరోసారి వలంటీర్లను పంపించకుండా పింఛన్ నగదును తిరిగి బ్యాంకులో జమ చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే ప్రతాప్ వెల్ఫేర్ అసిస్టెంట్ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేసే అర్హత ఉండి రిజెక్ట్ చేసిన పింఛన్లను పునరుద్ధరించాలని ఆదేశించారు.

పంట నమోదు చేయాలి

ఎ.కొండూరు: రైతులు పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ అధికారి టిప్పు సుల్తాన్ అన్నారు. ఎ.కొండూరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చీమలపాడు, రామచంద్రాపురం, ఎ.కొండూరు, కంభంపాడు, రేపూడి, గొల్లమందల, పోలిశెట్టిపాడు, గోపాలపురం పలు గ్రామాల్లో ఇప్పటి వరకు సుమారు 1300 ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాల వద్ద పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు తీసుకువెళ్లి పంట నమోదు చేయించుకోవాలన్నారు. దీంతో పంట నష్టపరిహారం , ఉచిత పంటల బీమా, పలు రకాల ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని తెలిపారు.

క్లుప్తంగా

నేడు, రేపు కొత్తపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

కొత్తపల్లి(గంపలగూడెం): మండలంలోని కొత్తపల్లిలో ఈ నెల 10, 11 తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే రక్షణ నిధి పాల్గొంటారని పేర్కొన్నారు.

అండర్-15 బాలికల క్రికెట్ టీమ్ కెప్టెన్‌గా జప్రామెహెక్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఏపీ అండర్-15 బాలికల క్రికెట్ టీమ్ కెప్టెన్‌గా కొండపల్లి డీఏవీ పాఠశాల పదో తరగతి విద్యార్థిని జప్రామెహెక్ ఎంపికైంది. గతంలో ఎన్‌సీసీ క్యాడెట్‌గా ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో ఎన్టీటీపీఎస్, పాఠశాల యాజమాన్యం క్రికెట్‌లో ప్రోత్సహించారు. క్రికెట్‌లో ప్రతిభ చాటుతూ రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక కావడంపై పాఠశాల ఇన్‌చార్జ్ ఏహెచ్ఎం డి.ఇందిరాప్రియ, పీఈటీ వి.రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

రోడ్డు పనులు ప్రారంభం



తిరువూరు: గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన సమస్యల పరిష్కారంలో భాగంగా తిరువూరు నగర పంచాయతీ పరిధిలోని 3, 4, 13 వార్డుల్లో రూ.60 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే రక్షణనిధి సోమవారం ప్రారంభించారు. నగర పంచాయతీ కమిషనర్ వెంకటేశ్వరరావు, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ల పంపిణీ



తునికిపాడు(గంపలగూడెం): మండలంలోని తునికిపాడులో కొత్తగా మంజూరైన ఫించన్లను సోమవారం సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, సర్పంచ్ నిడికొండ మాధవి పంపిణీ చేశారు. గ్రామంలో 36 మంది వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, డప్పు కళాకారులు, చర్మ కళాకారులకు కొత్తగా పింఛన్లు మంజూరైనట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు వేల్పుల విజయమ్మ, సొసైటీ అధ్యక్షుడు వేల్పుల చిన్న పిచ్చయ్య, గ్రామ సచివాలయ కన్వీనర్ కలవారి రామబ్రహ్మం, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

370 కోడి కత్తులు స్వాధీనం

మైలవరం: స్థానిక హాజీపేటలో కోడి పందేలకు ఉపయోగిస్తున్న 370 కత్తులను స్థానికుడు మాగిశెట్టి రామకృష్ణ వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ రమేష్ తెలిపారు. మైలవరం పీఎస్‌లో సోమవారం ఏసీపీ రమేష్ మాట్లాడుతూ డివిజన్‌లో కోడి పందేలు, పేకాడే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో సీఐ రమేష్, ఎస్సై రాంబాబు పాల్గొన్నారు.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి జైలు

విజయవాడ స్పోర్ట్స్: దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డి.సత్యవతి సోమవారం తీర్పు చెప్పారు. విజయవాడ కొత్తూరు తాడేపల్లిలోని తాళం వేసి ఉన్న ఇంట్లో ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లికి చెందిన భూక్యా రామచంద్రరావు గత ఏడాది జూలై 18వ తేదీన దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత కొత్తపేట స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి రెండు రోజుల తరువాత నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద రూ. 7 వేలను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణకిషోర్ కోర్టుకు వాదనలు వినిపించారు. ఎనిమిది మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు రామచంద్రరావుకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

నూజివీడు: స్పందనలో వచ్చే అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దని సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ హెచ్చరించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్పందనలో మొత్తం 15 అర్జీలు రాగా, వాటిని సంబంధిత అధికారులకు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ విద్యాసాగర్, ఐసీడీఎస్ సీడీపీఓ శేషుకుమారి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గంపలగూడెం: సమస్యల పరిష్కారానికే స్పందన కార్యక్రమమని ఎంపీడీఓ పిచ్చిరెడ్డి అన్నారు. గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ప్రజలు వ్యక్తిగత సమస్యలపై రెండు అర్జీలు ఇచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఏఈ కిషోర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మునిలక్ష్మి, ఐకేపీ ఏపీఎం నాగరాజు పాల్గొన్నారు.

ఎ.కొండూరు: స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఒక అర్జీ వచ్చినట్లు తహసీల్దార్‌చాట్ల వెంకటేశ్వర్లు తెలిపారు. చీమలపాడు నుంచి పట్టాదారు పాసు పుస్తకం మంజూరుకు అర్జీ అందినట్లు తెలిపారు.

మొక్కజొన్న తెగుళ్ల నివారణపై అవగాహన

చాట్రాయి: మొజొన్న పైరుకి ఆశించే తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన ఉండాలని మండల వ్యవసాయ అధికారి బి.శివశంకర్ అన్నారు. సోమవారం చాట్రాయి గ్రామంలో మొక్కజొన్న పైరును ఆయన పరిశీలించారు.

ప్రస్తుతం మొక్కజొన్నకు ఆశించిన కాండం కుళ్లు తెగులు నివారణకు ఎకరానికి 4 నుంచి 5 కేజీల బ్లీజింగ్ చల్లి తగినంత నీటిని ఉంచాలని సూచించారు. శిలీంద్రం నివారణకు 2.5 మిల్లీ లీటర్ల కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు.

చిత్తపూరులో వాలీబాల్ పోటీలు

చాట్రాయి: సంక్రాంతి పండగను సంప్రదాయంగా నిర్వహించుకోవాలని తహసీల్దార్ విశ్వనాథరావు సూచించారు. సోమవారం మండలంలోని చిత్తపూరులో సంక్రాంతి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీమోహనరావు, ఎస్సై కె.ప్రతాప్‌రెడ్డి, హైస్కూలు హెచ్ఎం రవి తదితరులు పాల్గొన్నారు.

రేపు పీఎస్ ప్రారంభం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను ఈ నెల 11న హోం మంత్రి తానేటి వనిత, నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభించనున్నట్లు ఎస్సై ఎస్.చంటిబాబు తెలిపారు. ఉదయం 10.38 గంటలకు ప్రారంభోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు.

సంక్షిప్తం

నిబంధనల మేరకే ధాన్యం కొనుగోలు

ముసునూరు: నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నామని రెవెన్యూ, వ్యవసాయ, పౌరసరఫరా అధికారులు తెలిపారు.'ప్రశ్నార్థకంగా ధాన్యం కొనుగోలు' పై ఓ పత్రికా కథనం అవాస్తవమని రెవెన్యూ, ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ దాసరి సుధ అధ్యక్షతన సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించి ఆ కథనాన్ని ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఆర్బీకేల ద్వారా 1538 మంది రైతుల నుంచి 6,672.520 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. సక్రమంగా నిర్వహిస్తున్న పథకాన్ని అభాసుపాలు చేయాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు. సివిల్ సప్లయీస్ అధికారుల నిరంతర పర్యవేక్షణలో నిబంధనల ప్రకారమే ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో సివిల్ సప్‌లై డీటీ వెంకటేశ్వరరావు, వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ పి.గంగాధర్, స్థానిక రైతు తులిమెల్లి రంగా రావు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'తో అభివృద్ధి పనులు

చంద్రాల(మైలవరం): ఉపాధి పథకం ద్వారా చంద్రాలలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మాజీ ఎంపీపీ జొన్నలగడ్డ గంగాధర రావు తెలిపారు. చంద్రాల గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో సర్పంచ్ జ్యోతి అధ్యక్షతన సోమవారం గ్రామ సభ జరిగింది. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు. చంద్రాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక రాము సౌజన్యంతో పదో తరగతి విద్యార్థులకు జగనన్న స్ఫూర్తి-భవితకు భరోసా పేరుతో వచ్చిన స్టడీ మెటీరియల్‌ను సర్పంచ్ జ్యోతి, గంగాధరరావు అందజేశారు.

కుట్టు శిక్షణ తరగతుల ముగింపు

తిరువూరు: స్థానిక మధిర రోడ్డులోని ప్రజ్వల సేవా సంస్థ ఆధ్వర్యంలో 3 నెలలుగా మహిళలకు నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీ సేవాసంస్థ ఇన్‌చార్జి సిస్టర్ షైనీ జోష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

ఆగిరిపల్లి: నాడు - నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ కలిగిందని నాన్ అకడమిక్ ఎంఈఓగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తోన్న ఏపీఎం బి.రామకృష్ణ అన్నారు. ఆగిరిపల్లి మండలం ప్రాథమికోన్నత పాఠశాలలో నాడు - నేడు పథకంలో నిర్వహించిన పనులను సోమవారం ఆయన పరిశీలించారు.

ఎడ్లబండ్లపై ఇసుక తరలింపునకు అనుమతి తప్పనిసరి

గంపలగూడెం: మారిన నిబంధనల ప్రకారం మండలంలోని ప్రధాన నీటి వనరైన కట్టలేరులో ఇసుక రేవుల నుంచి ఎడ్లబండ్లపై ఇసుక తరలింపునకు అనుమతి తప్పనిసరని ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ సెక్రటరీ నుంచి ఆయా గ్రామాలకు కట్టలేరు నుంచి ఇసుక కూపన్లు తీసుకోవాలని సూచించారు.

ఆరాధనోత్సవాలు ప్రారంభం

తిరువూరు: స్థానిక త్యాగరాజ గానకళాసమితి ఆధ్వర్యాన సోమవారం త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేదస్వస్తితో కార్యక్రమాలు మొదలయ్యాయి. త్యాగరాజస్వామి నగరోత్సవం నిర్వహించిన అనంతరం సిద్ధి బుద్ధి సమేత విఘ్నేశ్వర కల్యాణం నిర్వహించారు. చిత్రాల నారాయణ, యనమల రమేష్, మహ్మద్ అలీ సాహెబ్, అరిసేపల్లి రామకృష్ణ, బాబూరావుల నాదస్వర కచేరీ, దేవిని నిహారిక గాత్ర కచేరీ, బుర్రా పద్మనాభశర్మ హరికథా గానం కార్యక్రమాలు జరిగాయి. గానకళాసమితి అధ్యక్ష కార్యదర్శులు సుబ్రహ్మణ్యశాస్త్రి, సీతారామ లింగేశ్వరశర్మ పర్యవేక్షించారు.

బీమా సాయం అందజేత

చంద్రాల(మైలవరం): వైఎస్సార్ బీమా పథకంలో తక్షణ సాయాన్ని లబ్ధిదారు కందుల నాగలక్ష్మికి సర్పంచ్ జ్యోతి, మాజీ ఎంపీపీ జొన్నలగడ్డ గంగాధరరావు పంచాయతీ కార్యాలయంలో సోమవారం అందజేశారు. మైలవరం మండలం చంద్రాల గ్రామానికి చెందిన కందుల శివనాగరాజు ఇటీవల మరణించాడు. వైఎస్సార్ బీమా పథకంలో నాగరాజు భార్య నాగలక్ష్మికి రూ.లక్ష మంజూరవ్వగా తక్షణ సాయంగా రూ.10 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు.

కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో కృష్ణా జలాలు

ఎ.కొండూరు: కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో కృష్ణా జలాలు సరఫరా చేయిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హెచ్ లక్ష్మి సోమవారం తెలిపారు. కోమటికుంట, లక్ష్మీపురం, కేశియాతండా, వెంకటతండా, పెద్ద తండా, వల్లంపట్ల, దీప్లానగర్, మాన్సింగ్ తండా, కృష్ణారావుపాలెం గ్రామాల్లో 21 ట్యాంకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ గ్రామాల్లో రోజూ పర్యవేక్షిస్తున్నామన్నారు.

విజేతలకు బహుమతీ ప్రదానం

విస్సన్నపేట: ప్రశాంత్ మెమోరియల్ షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. గుడివాడకు చెందిన రాము, దిలీప్ టీం మొదటి స్థానం సాధించగా రూ.10 వేలు నగదు అందజేశారు. విస్సన్నపేటకు చెందిన హర్ష, శ్యామ్ టీంకు రూ.8 వేలు, గుడివాడకు చెందిన పవన్ ,పెద్ద శివ టీంకు రూ.6 వేలు, ఆరీఫ్, విక్టర్‌రాయ్ టీంకు రూ.4 వేలను బహుమతులుగా అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులు కొండా రాజ్ కుమార్, ఐజాక్‌రాయ్, కమిటీ సభ్యులు శ్యాం, రాజహర్ష తదితరులు పాల్గొన్నారు.